సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

కుత్బుల్లాపూర్, అక్టోబర్4 : దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేట్‌కు చెందిన టి.వెంకటేశ్వర్లు, దూలపల్లి ప్రాంతానికి చెందిన ఎన్.లక్ష్మీనారాయణ మెరుగైన వైద్య ఖర్చుల కోసం సీఎం సహాయ నిధి నుంచి విడుదలైన రూ.2 లక్షల 85 వేల ఆర్థిక సాయాన్ని శుక్రవారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ తన క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబాలకు అందించారు. ఆపదలో ఉండి ఆర్థిక సాయం కోసం ఎదురుచూసే వారికి సీఎం సహాయనిధి ఎంతో భరోసానిస్తుందన్నారు.

గౌడ సంక్షేమాభివృద్ధికి కృషి చేస్తా

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కుత్బుల్లాపూర్, అక్టోబర్ 4: కుత్బుల్లాపూర్ గౌడ సంక్షేమ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ గౌడ సంఘం అధ్యక్షులు కూన రాజ్ సమావేశానికి ఎమ్మెల్యే కేపీ, కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కమ్యూనిటీహాల్ నిర్మాణంతోపాటు సర్దార్‌సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహం ఏర్పాటుకు సహాయ సహకారాలు అందించాలని కుత్బుల్లాపూర్ గౌడ సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా..సానూకులంగా స్పందించారు. గౌడ సంఘం సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కూన శ్రీరాములు, మద్దెల జైరాజ్, కూన సుధాకర్, బాస్పల్లి వ్యాస్, కూన శ్రవణ్‌తోపాటు కుల సంఘం పెద్దలు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్

కూకట్‌పల్లి రామాలయంలో లాకర్‌గది ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, కార్పొరేటర్లు

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 4:కూకట్‌పల్లి రామాలయంలో నూతనంగా నిర్మించిన లాకర్ గదిని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ కుర్మయ్యగారి నవీన్‌కుమార్ ప్రారంభించారు. అలాగే ఆలయంలో సహస్ర దీపాలంకరణ మండపానికి శంకుస్థాపన చేసి, రామాలయం గర్భగుడికి ఇత్తడి తొడుగును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూకట్‌పల్లి గ్రామంలో ౪౦౦ఏండ్ల చరిత్ర కలిగిన రామాలయాన్ని అద్భుతంగా పునః నిర్మించిడం జరిగిందన్నారు. ఆలయంలో దేవుడికి సంబంధించిన ఆభరణాలు, ఇతర వస్తువులను భద్రపరిచేందుకు లాకర్ గదిని నిర్మించడం జరిగిందన్నారు. భవిష్యత్‌లో మరింతగా ఆలయాన్ని అభివృద్ధి చేసేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాముడి దయతో కూకట్‌పల్లి ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా రామాలయాన్ని సందర్శించిన విదేశి ప్రతినిధులను సన్మానించారు.కార్యక్రమంలో కార్పొరేటర్‌లు జూపల్లి సత్యనారాయణ, మాధవరం రోజాదేవిరంగారావు, ఎలమంచలి రాధాకృష్ణ, గోనే వెంకటరమణ, మోహన్,లక్ష్మి, మాజీ కార్పొరేటర్‌లు పగుడాల బాబురావు, తూము శ్రావణ్‌కుమార్,ఆలయ కమిటీ చైర్మన్ తులసి, దేవాలయ కార్యనిర్వహణాధికారి అంజయ్య పాల్గొన్నారు.

అట్టహాసంగా డిజైన్ డెమోక్రసీ

మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో శుక్రవారం డిజైన్ డెమోక్రసీ 2024 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఐటీ ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్ విచ్చేసి చీఫ్ నేషనల్ కోచ్, పద్మభూషన్ అవార్డు గ్రహీత పుల్లెల గోపిచంద్, ఫిక్కీ ఫ్లో మాజీ చైర్‌పర్సన్ పంకీరెడ్డి, డిజైన్ డెమోక్రసీ వ్యవస్తాపకురాలు శైలజా పట్వారీలతో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. ఇందులో పలు రకాల ఇంటీరియర్ ఉత్పత్తులను ప్రదర్శించడంతో ఐటీ ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ స్టాల్స్‌ను సందర్శించారు. *– మాదాపూర్, అక్టోబర్ 4*

అల్లాపూర్ డివిజన్ పరిధిలో దసరా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతన్నాయి. శుక్రవారం పలు దుర్గమాత మండపాల్లో గాయత్రిదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. - అల్లాపూర్

మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం

కాలనీల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ అన్నారు. అధిక నిధులు సమకూర్చుకుంటూ ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామన్నారు. హైదర్‌నగర్ డివిజన్ హెచ్ఎంటీహిల్స్, రాంనరేష్‌నగర్‌లో రూ. 75.50లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావుతో కలిసి గాంధీ శుక్రవారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాలనీవాసులు, పార్టీ నేతలు పాల్గొన్నారు. *– మియాపూర్, అక్టోబర్ 4*

అవార్డుల పోస్టర్ ఆవిష్కరణ

కొండాపూర్, అక్టోబర్ 4:ఆర్వీ వల్లభనేని స్టూడియోస్ ఆధ్వర్యంలో నవంబర్ 30, డిసెంబర్ 1వ తేదీల్లో ఫిల్మ్‌నగర్‌లోని జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో కాస్ట్యూమ్ అండ్ ఫ్యాషన్ అవార్డుల (సీఎఫ్ఏ) ప్రదానోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆర్వీ వల్లభనేని స్టూడియోస్ ప్రతినిధులు వల్లభనేని గోపిచంద్, అరుణశ్రీ సుకన్న తెలిపారు. శుక్రవారం మాదాపూర్‌లోని ట్రైడెంట్ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డులకు సంబంధించిన పోస్టర్‌ను డాక్టర్ ఖాలిద్ ఆల్ బలూషి, డాక్టర్ కబీర్ కేవీ, శివానీ గుప్తాలతో కలిసి ఆవిష్కరించారు.

పరామర్శ

దుండిగల్,అక్టోబర్4:దుండిగల్ మున్సిపాలిటీ 27వ వార్డు కౌన్సిలర్ కొర్ర శంకర్‌నాయక్‌తో పాటు ఆయన కుటుంబసభ్యులను ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శంభీపూర్‌రాజు పరామర్శించారు. శంకర్‌నాయక్ తల్లి కొర్ర లక్ష్మిభాయి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన నేపథ్యంలో శుక్రవారం ఎమ్మెల్సీరాజు స్వయంగా శంకర్‌నాయక్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు ఆగం రాజు,బాలాజీనాయక్ బౌరంపేట్ పీఏసీఎస్ డైరెక్టర్ మోహన్‌నాయక్,గాజులరామారం డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు విజయరాంరెడ్డి,నేతలు అమర్‌సింగ్,రవీందర్ పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇప్పిస్తామనడం తప్పుడు ప్రచారమే..

దుండిగల్,అక్టోబర్4:జర్నలిస్టులను మభ్యపెట్టి పక్కదారి పట్టించేందుకు ఓ యూనియన్ చేస్తున్న చర్యలను తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) నాయకులు వ్యతిరేకించారు. సదరు యూనియన్ చేస్తున్న అనధికారిక కార్యకలాపాలకు మీడియా అకాడమీ చైర్మన్ మద్దతు ఇవ్వడాన్ని వారు తప్పుపడుతున్నట్లు స్పష్టం చేశారు. గాజులరామారం సర్కిల్, సూరారంలోని అంబేద్కర్ భవన్‌లో శుక్రవారం జరిగిన టీడబ్ల్యూజేఎఫ్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం విస్తృతస్థాయి సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య,ఉపాధ్యక్షులు పులిపలుపుల ఆనందం, కార్యదర్శులు ఎస్‌కే.సలీమా, నాయకులు తన్నీరు శ్రీనివాస్ పాల్గొని ప్రసంగించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం టీడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షుడు గడ్డమీది అశోక్, ప్రధాన కార్యదర్శి పి.శంకర్, కోశాధికారి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

దసరాకు హెచ్‌సీయూ ప్రత్యేక బస్సులు

శేరిలింగంపల్లి, అక్టోబర్ 4: దసరా పండుగను పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీజీఆర్టీసీ) అధ్వర్యంలో సెంట్రల్ యూనివర్సిటీ బస్ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ఎం.మురళీధర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే ఈ సర్వీసులు ఈనెల 12వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయని, లింగంపల్లి నుంచి ఎంజీబీస్ వరకు, గచ్చిబౌలి–మహబుబ్‌నగర్, లింగంపల్లి–జహీరాబాద్ ప్రాంతాలకు అదనంగా ఈ బస్సులు నడుస్తాయన్నారు. మరిన్ని వివరాలకు హెచ్‌సీయూ ఏఎంటీ రవికుమార్‌ను ఫోన్ నంబర్ 738281 4235లో సంప్రదించాలని ఆయన సూచించారు. పండుగకు ఊరు వెళ్లే ప్రయాణికులు అందుబాటులో ఉన్న ఈ ఆర్టీసీ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరారు.